ఇళ్లలోకి వరద



కురిసిన వర్షాలకు కల్వర్టుల్లోని వరద నీరు ఇళ్లలోకి చేరుతుంది. శుక్రవారం మండలంలోని నందిగామలో ఇళ్ల, పరిసర ప్రాంతాల్లో నీరు చేరుతుంది. అలాగే దోమలు ఆవాసాలు సైతం ఏర్పాటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కల్వర్టుల్లో నిలిచిన నీరును పారించాలని కోరుతున్నారు. -నిజాంపేట(మెదక్)

పొట్టు..తప్పతోంది..

రైస్ మిల్లు చెందిన ఊక (వడ్లపొట్టు) రోడ్డున వెళ్లే వాహనదారుల కళ్లలో పడుతుంది. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దు నిర్మించకపోవడమే ఇందుకు కారణం. మండలంలోని లింగాపూర్.. బాయిలర్ రైస్ మిల్లు రోడ్డుకు దగ్గరగా ఉంటుంది. వడ్లను మరాడించినప్పుడు బయటకొచ్చే ఊకకు పెద్దు నిర్మించడం లేదు. దీంతో గాలికి రోడ్డుపై వెళ్తున్న వాహనదారుల కళ్లల్లో పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన యజమానులు పెద్దు నిర్మిస్తే బయటకు రాదని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మిల్లు భాగస్వామి అయిన భిక్షపతిని వివరణ కోరగా త్వరలోనే పెద్దు నిర్మిస్తామన్నారు. -నర్సాపూర్



రైస్ మిల్లు నుంచి బయటకొస్తున్న పొట్టు

మహాపూర్ణాహుతి

శివ్వంపేట మండలం గోమారంలో చతుర్వేత హవనం ఉత్సవాలు మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఈనెల 12న ప్రారంభంకాగా మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. లోకకల్యాణం కాంక్షించి చతుర్వేత హవనం.. పాలకుర్తి సుధాకర్ గౌతమ్‌శర్మ పర్యవేక్షణలో వేలేటి సిద్ధరామేశ్వర శర్మ ద్వివేది వైదిక నిర్వహణలో పూజ మహోత్సవాలు చేపట్టారు. శుక్రవారం ప్రాతః కాల పూజలు, చతుర్వేత హవనం, జయాదులు, బలిహరణం, కలశోద్వాసన, మహాదాశీర్వచనం.. మహా పూర్ణాహుతి చేపట్టారు. -శివ్వంపేట(నర్సాపూర్)



చాముండేశ్వరీ మాత



ఆలయంలో భక్తులు

క్లుప్తంగా

9 వేల గన్నీ బ్యాగులు రాక

సాక్షి ఎఫెక్ట్

రేగోడ్(మెదక్): తూకం కోసం నిరీక్షణ అనే శీర్షిక పేరిట కథనాన్ని సాక్షి దినపత్రిక శుక్రవారం ప్రచురించింది. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు తొమ్మిది వేల గన్నీ బ్యాగులు స్థానిక జొన్నల కొనుగోలు కేంద్రానికి పంపించారు. ఈ విషయాన్ని పీఏసీఎస్ సీఈఓ హఫీజొద్దీన్ తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు తాము తీసుకొచ్చిన జొన్నలను వెంటనే తూకం వేస్తున్నారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

చేగుంట(తూప్రాన్): గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్‌ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ సంపత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 23న కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట గిరిజన బాలుర గురుకులం, 25న మెదక్ జిల్లా చేగుంట బాలికల గిరిజన గురుకులంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, పదో తరగతి మెమో, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల కోసం ఆయా జిల్లాల గిరిజన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): బైక్‌ను ఆటో ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఉసిరికపల్లి తండాకు చెందిన పాత్లోత్ శ్రీనివాస్ బైక్‌పై కొత్తపేటకు వెళ్తున్నాడు. కాగా అతడి వాహనాన్ని ఆటో ఢీ కొట్టగా గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా ఇక్కడికి చేరుకొన్న అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది.

రఘునందన్ గెలుపుపై ధీమా



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వానికి జై కొట్టబోతున్నారన్నారు. అబ్‌కీ బార్ చార్‌సౌ పార్ నినాదంతో ప్రజలు ఏకీభవిస్తున్నారన్నారు. మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రానుందని, మోదీ మూడోసారి కూడా పీఎం కానున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రాకేష్, ప్రధాన కార్యదర్శి కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నశంకరంపేట(మెదక్): స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగేందర్ శుక్రవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ తెలుగు మీడియం, ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందన్నారు. ఒకేషనల్ కోర్సుల్లోనూ చేరవచ్చన్నారు.

లోదుక్కు.. లాభాలు దక్కు

ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కి దున్నాల్సిందే. విత్తనం విత్తేందుకు సిద్ధం చేసుకోవాలి. లేకుంటే చీడపీడలు ఆవాసం ఏర్పాటు చేసుకుంటే భూమి సత్తువ కోల్పోతుంది. అలాగే సమగ్ర సస్యరక్షణ వల్ల పైరులపై వచ్చే చీడపీడలను ఎప్పటికప్పుడు అంచనాలు వేయొచ్చు, తక్కువ ఖర్చుతో సేద్య, యాంత్రిక, జీవ నియంత్రణ పద్ధతులు అవలంభి పురుగుల ఉధృతిని నివారించవచ్చు.

- ఎప్పటికప్పుడు చీడపీడల అంచనా
- సస్యరక్షణ చర్యలతో నివారణ



వేసవి దుక్కి దున్నుతున్న రైతు

కొల్చారం(నర్సాపూర్): వరిని కాండం తొలిచే పురుగు ఆశించి నష్టం చేస్తుంది. పంట పూర్తయిన తరువాత మిగిలిపోయిన మొక్కల మొదళ్లలో తన కోశస్థ దశను పూర్తి చేసుకుంటుంది. అందువలన పంట కోతలు అయిన తర్వాత వేసవిలోతు దుక్కులు చేస్తే మొక్కల మొదళ్లలో ఉన్నటువంటి కోశస్థ దశ బయటపడి సూర్యరశ్మి తాకిడికి, పక్షుల బారిన పడి చనిపోతుంది.

పత్తిలో...

పత్తిని శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, మచ్చల కాయల తొలిచే పురుగులు ఆశిస్తాయి. 100 రోజుల పంట కాలం పూర్తయిన తర్వాత నష్టం చేసే అవకాశం ఉంది. ఇవి తమ కోశస్థ దశను భూమిలో జరుపుకొంటాయి. పంట పూర్తయిన తర్వాత వేసవిలో లోతు దుక్కులు చేయాలి. తద్వారా వాటి జీవిత చక్రం అంతటితో ఆగిపోతుంది. సంతతి తగ్గి, తర్వాత పంటలో వాటి ఉధృతి కూడా తగ్గిపోతుంది.

వేరుశనగలో

వేరుశనగలో వేరు పురుగు, పొగాకు లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు, ఎర్రగొంగళి పురుగులు ఆశించి చాలా నష్టాన్ని కలిగిస్తాయి. వేరుపురుగు వివిధ దశలు, పొగాకు లద్దె పురుగు ప్యూపా దశలన్నీ భూమిలో జరుపుకొంటుంది. పంట పూర్తయిన తర్వాత లోతు దుక్కులు చేయాలి. అప్పుడే పురుగుల కోశస్థ దశలు నాశనమవుతాయి. పంటల్లో వాటి నష్టాన్ని చాలావరకు అరికట్టవచ్చు.

జొన్న, మొక్కజొన్నలో...

జొన్న, మొక్కజొన్నను ఎర్ర గొంగళి పురుగు ఆశించి తీవ్ర నష్టం చేస్తుంది. దీని ప్యూపాదశ భూమిలోపల ఉంటుంది. అందువల్ల పంటల కోతలైన తర్వాత వేసవి దుక్కులు చేయాలి. ఈ పురుగు ప్యూపా దశ బయట పడి ఎండతాకిడి పక్షుల బారిన పడి చనిపోతుంది.

చెరకులో..

చెరకులో వేరు పురుగు ఆశించి నష్టాన్ని కలిగిస్తుంది. వేరు పురుగుకు చెందిన గుడ్డు, లార్వా, కోశస్థ దశ, పెంకు (పెద్ద పురుగు) పురుగు కోశస్థ దశలు భూమిలో జరుపుకుంటుంది. లార్వా దశలో మొక్కల వేర్లను కత్తిరిస్తుంది. ఆపై తిని నష్టాన్ని కలిగిస్తుంది. కొంత కాలం భూమి లోపల ఉండి, ఇంకొంతకాలం బయట ఉంటాయి. పొలం చుట్టూ ఉన్నటువంటి వేప, సుబాబుల్ లాంటి చెట్ల ఆకులను తింటాయి. కాగా, వేసవిలోతు దుక్కులు వల్ల వివిధ దశలు ఎండ తాకిడికి, పక్షుల వల్ల నాశనమవుతాయి.

గాలొచ్చినా.. వానొచ్చినా చిమ్మచీకటే!

- విద్యుత్ శాఖాధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ

పాపన్నపేట(మెదక్): మండలంలో చిన్నపాటి గాలి వీచినా.. వానొచ్చినా కరెంట్ పోవడం సర్వసాధారణమైందని మండల ఎంపీటీసీలు శ్రీనివాస్, కుబేరుడు, రాము ఆరోపించారు. శుక్రవారం ఎంపీపీ చందన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు మాట్లాడారు. మండలంలో కరెంట్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందన్నారు. గురువారం సాయంత్రం గాలి వాన రాగా 6 గంటల పాటు కరెంట్ పోయిందన్నారు. రాత్రి కూడా కొన్ని గ్రామాలకు కరెంట్ సరఫరా పునరుద్ధరించారన్నారు. ఇంకొన్ని గ్రామాలు చీకట్లోనే గడిపాయన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రవాణా వ్యవస్థ సరిగా లేక రైతులు ఆందోళనకు దిగాల్సి వస్తుందని ఎంపీటీసీ కుబేరుడు అన్నారు. వర్షానికి తడిసి ధాన్యంకు మొలకలు వస్తున్నాయని చెప్పారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన వాటిలో పనులు జూన్ 5లోపు పూర్తి చేయాలని ఎంఈఓ నీల కంఠం సూచించారు. ఉపాధి హామీ కూలీలంతా పోస్టాఫీసుల్లోనే ఖాతాలు తెరవాలని ఎంపీడీపీ సుబ్రహ్మణ్యం కోరారు. ఐదేళ్లలో తనకు అన్ని విధాలా సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు చందన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్పీఓ సతీష్ కుమార్, కో–ఆప్షన్ సభ్యులు గౌస్, వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల సిండికేట్

- రెండు సార్లు తరుగు తీస్తున్నారని రైతుల ఆవేదన
- రహదారిపై బైఠాయించి రాస్తారోకో



రామాయంపేట-సిద్దిపేట రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

రామాయంపేట(మెదక్): తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తూకం వేసిన బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని శుక్రవారం రామాయంపేటలోని హరిజనవాడ వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. తమ ధాన్యం రోడ్డుపైనే ఉందన్నారు. లారీలో అసలు రావడం లేదని వాపోయారు. దీంతో రామాయంపేట, సిద్దిపేట రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్నామని వెల్లడించారు. మిల్లర్లు తమను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేస్తున్న క్రమంలో 2 కిలోల తరుగు, మిల్లుల్లో ఇంకోసారి తరుగు తీస్తున్నారన్నారు. మిల్లర్లు వారి లాభాల కోసం సిండికేట్‌గా మారి నిండా ముంచుతున్నారని మహిళా రైతులు వాపోయారు. వందలాది బస్తాలు 20 రోజులుగా రోడ్డుపైనే ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సర్ది చెప్పి శాంతింపజేసి ఆందోళనను విరమింపజేశారు.

వేలం ద్వారా రూ.12.60 లక్షల ఆదాయం

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయానికి రూ.12.60 లక్షల ఆదాయం సమకూరింది. శుక్రవారం ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజ సామాగ్రి అమ్మకాల కోసం వేలం నిర్వహిస్తే చిన్నగొట్టిముక్లకు చెందిన కర్రె మహేష్ రూ. 12.60లక్షలకు దక్కించుకున్నారు. గతంలో రూ.8.50 లక్షలకు వేలం పాడారు. ఇప్పుడు రూ. 4.10 లక్షలు అదనపు ఆదాయం సమకూరింది. ఈ నెల 23 నుంచి ఏడాదిపాటు విక్రయాలు జరుపుకోవచ్చని ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డి, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ, గ్రామస్తులు నారాయణరావు, శ్రీపతిరావు, నరేందర్, పాపయ్యచారి, వీరాస్వామి, హర్షనాయక్, రాజేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్న సిబ్బంది

మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాల మౌలిక సదుపాయాలను శుక్రవారం ఇరిగేషన్ ఏఈ మమత పరిశీలించారు. చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నీటి వసతి కోసం పాఠశాలలో సంపు నిర్మాణం జరుగుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ వివరించారు. పాఠశాలలో పూర్తి చేసిన విద్యుత్ పనులు, ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఏఈ పరిశీలించి పలు సూచనలు చేశారు. అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధవి, సీఏ సరిత వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, గ్రామస్తులున్నారు.



కర్నాల్‌పల్లి పాఠశాలలో ఏఈ మమత

ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలి

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ పాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బర్దిపూర్, పల్వంచల్లోని హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులకు డబ్బులు చెల్లిస్తామన్నారు. పనికి తగిన కూలి వస్తుందన్నారు. కూలీలు ఉదయం వేళల్లోనే పనులు చేయాలన్నారు. ఇందుకు ఎండలు ముదరమే కారణమన్నారు. వారు తవ్విన చెరువుల్లోని మట్టిని రైతులు తమ పంట పొలాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముందస్తు అంచనా వేసిన ప్రతి పనినీ కూలీలతో చేయించాలని సిబ్బందిని ఆదేశించారు.



బర్దిపూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ పాల్

కరాటేలో అదరగొట్టిన శశాంక్‌సింగ్

సంగారెడ్డి టౌన్: ఇటీవల మలేషియాలో నిర్వహించిన కరాటే పోటీల్లో తెలుగు కుర్రోడు శశాంక్‌సింగ్ అదరగొట్టాడు. సంగారెడ్డి మండల పరిధిలోని కలబ్‌గుర్ గ్రామానికి చెందిన శశాంక్ సంగారెడ్డిలోని లిటిల్ బర్డ్స్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. మలేషియాలో మూడు రోజుల పాటు నిర్వహించిన కరాటే విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా శశాంక్‌సింగ్‌తో పాటు ఆయన తండ్రిని గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. గ్రామం పేరును మలేషియా వరకు తీసుకెళ్లినా శశాంక్‌సింగ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసిఫ్, చక్రపాణి, ఆనంద్, అజయ్, అమ్‌జద్, మున్నా, వాజిద్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి జాతర

కొమురవెల్లి మల్లన్న తర్వాత అంతటి మహిమ గల స్వామి గడిపెద్దాపూర్ మల్లికార్జునుడు. కోరిన కోరికలు నెరవేరుస్తారని ఇక్కడి భక్తుల నమ్మకం. ఈనెల 20 నుంచి 24 వరకు జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 20న స్వామి వారికి గడప కడగడం, 21 బోనాలు, 22న మల్లికార్జున స్వామి ఆలయం చుట్టూ ఎండ్ల బండ్ల ప్రదక్షిణలు, 23న లంకా దాహనం, 24న స్వామి వారికి పాచి బండ్ల ప్రదక్షిణలతో ఉత్సవాలు ముగుస్తాయి. -అల్లాదుర్గం(మెదక్)



మల్లికార్జున స్వామివారు

సంక్షిప్త వార్తలు

◆ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 27 వరకు జరగనున్నాయి. తొలిరోజు విష్వక్సేన పూజ, పుణ్య వచనం, కంకణ దారణం, పుట్ట బంగారం, అగ్ని ప్రతిష్ఠ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. శనివారం హోమం, బలిహారం, ధ్వజారోహణం, స్వామివారి తిరు కల్యాణం, ఊరేగింపు జరుగుతుందని ఆలయ పూజారి గోపాలకృష్ణశర్మ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

◆ దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి : జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): రైతులు అమ్ముకునే దొడ్డు రకం వడ్లకు కూడా రూ.500లు బోనస్ చెల్లించాలని జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. తన చాంబర్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం హామీలను అమలు చేస్తానని ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ధాన్యానికి క్వింటాలుకు రూ. 500ల బోనస్ చెల్లిస్తామని ప్రకటించిందన్నారు. ఇప్పుడు కేవలం సన్న రకం వడ్లకేనని ముఖ్యమంత్రి మాట్లాడటం రైతాంగాన్ని మోసం చేయడమేనన్నారు. బేషరతుగా దొడ్డు రకానికి కూడా కాంగ్రెస్ రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు మురళి, అశోక్‌గౌడ్, గంగాధర్ పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హవేళీఘణాపూర్(మెదక్): నాగాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఏ మోహన్‌బాబు, ఏఈ వినోద్‌లు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

◆ త్వరలో బొల్లారం మున్సిపాలిటీ విలీనం

జిన్నారం(పటాన్‌చెరు): గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్ జోన్‌లో బొల్లారం మున్సిపాలిటీ త్వరలో విలీనం కానుందని, దీంతో బొల్లారం మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్ జోన్‌లో బొల్లారం విలీనం కానుందని అని తెలిపారు. విలీన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

◆ జొన్నల కొనుగోలులో నిర్లక్ష్యం తగదు

కల్హేర్(నారాయణఖేడ్): జొన్నలను కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని కాంగ్రెస్ మండల నాయకుడు దేవదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్హేర్, మార్డి, కృష్ణాపూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా మార్క్‌ఫెడ్, ఐకేపీ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కల్హేర్, మార్డి, కృష్ణాపూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.